

తలపాగాలతో ఉత్సాహంగా పాల్గొని థమ్స్ అప్ చూపుతున్న మహిళ నాయకులు



ఓల్డ్ బోయిన్‌పల్లిలో వేలాది మంది ప్రజలతో రోడ్‌షో నిర్వహిస్తున్న మాధవరం కృష్ణారావు



రోడ్‌షోలో పాల్గొన్న అశేష జనవాహిని

ముచ్చటగా మూడోసారి గెలిపించండి

కూకట్‌పల్లి బీఆర్ఎస్ అభ్యర్థి మాధవరం కృష్ణారావు

ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్‌లో మాధవరం కృష్ణారావు నిర్వహించిన రోడ్‌షోకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. మహిళలు ఆటపాటలు, బతుకమ్మలు, తీన్‌మార్ డ్యాన్సులతో రోడ్‌షో దద్దరిల్లింది. ఎక్కడ చూసినా ప్రజా ప్రభంజనంతో రహదారులు గులాబీమాయంగా మారిపోయాయి. ప్రజలు మాధవరం కృష్ణారావుకు మంగళ హారతులతో స్వాగతం పలికారు. ప్రజాభిమానాన్ని ప్రత్యక్షంగా చూసిన కృష్ణారావు కళ్లు చెమ్మగిల్లాయి.

ఓల్డ్‌బోయిన్‌పల్లి: డివిజన్ కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణరావు రోడ్ షో ప్రియదర్శిని హోటల్ నుంచి మొదలై అలీ కాంప్లెక్స్, వార్డు ఆఫీస్, మల్లికార్జుననగర్ కాలనీ, కళింగ ఎన్‌క్లేవ్, ఆర్‌ఆర్‌నగర్, హెచ్‌ఏఎల్ పార్కు రమ్య నర్సింగ్ హోమ్, పార్టీ కార్యాలయం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రజాదరణనే తన విజయానికి పునాది అని అన్నారు. పదేళ్లుగా ప్రజలు తనను ఇంటి సభ్యుడిగా ఆదరిస్తున్నారని పేర్కొన్నారు. అందుకే ఈసారి కూడా భారీ మెజార్టీతో గెలిపిస్తారనే నమ్మకం ఉందన్నారు.

హస్మత్‌పేట ప్రజల కష్టాలను తీర్చాను...

◆ దశాబ్దాలుగా బోయిన్‌పల్లి హస్మత్‌పేట ప్రజలు నీటి ఎద్దడితో ఇబ్బందులు పడ్డారన్నారు. స్థానిక చెరువుతో ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకుని కల్వర్టు నిర్మాణం చేపట్టి చెరువును సుందరీకరించామన్నారు. అదే విధంగా బతుకమ్మ కుంటలను నిర్మించామని తెలిపారు. గల్లీ గల్లీకి సీసీ, బీటీ రోడ్లు.. ఇంటింటికీ తాగునీరు.. నిరంతర విద్యుత్‌తో పాటు శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా రక్షణ కల్పిస్తున్నామని అన్నారు. ఈ నెల 30వ తేదీన జరిగే ఎన్నికలలో కారు గుర్తుకు ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు.

నా గెలుపు అభివృద్ధికి మలుపు.....

◆ తన గెలుపు అభివృద్ధికి మలుపు అని అన్నారు. తనను మరోసారి దీవించి విజయాన్ని అందిస్తే అభివృద్ధికి మారుపేరుగా కూకట్‌పల్లి తయారు చేస్తానన్నారు. ఈ రోడ్ షోలో నాయకులు నరేందర్‌గౌడ్, మక్కాల నర్సింగ్‌రావు, బల్వంత్‌రెడ్డి, కర్రె లావణ్య, సయ్యద్ ఏజాజ్, ఇర్ఫాన్, మేకల హరినాథ్, ఏనుగుల తిరుపతి, వేణుగోపాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, బల్‌రాజు, పోచయ్య, మల్లేష్‌యాదవ్, చందుయాదవ్, దాసు, మక్కాల సత్యనారాయణ, లలితా, సరోజదేవి, ఉదయరాణి, రాజేశ్వరి, నాయకులు పాల్గొన్నారు.

కృష్ణారావుకే మా మద్దతు

బ్రాహ్మణుల ఏకగ్రీవ తీర్మానం



కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఎస్‌కేఎస్‌ఆర్ గార్డెన్స్‌లో శనివారం బ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి బీఆర్ఎస్ అభ్యర్థి మాధవరం కృష్ణారావు పాల్గొని మాట్లాడారు. బ్రాహ్మణుల అభ్యున్నతికి సీఎం కేసీఆర్ ముందుంటారని అన్నారు. అదే విధంగా ఆలయాల ధూప, దీప నైవేద్యాలకు చర్యలు తీసుకున్నారని తెలిపారు. వారికి నెల నెలా జీత భత్యాలు అందజేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ అని గుర్తు చేశారు. అదే విధంగా దేవాలయాల పునరుద్ధరణ విషయంలో ముందుంటున్నామని పేర్కొన్నారు.

◆ బ్రాహ్మణుల కోసం భవనాన్ని అత్యంత సుందరంగా నిర్మించి అందజేశారని తెలిపారు. ఈ విధంగా బ్రాహ్మణుల సంక్షేమానికి ముఖ్యమంత్రి కేసీఆర్ చేదోడువాదోడుగా ఉంటారన్నారు. తన హయాంలో కూకట్‌పల్లి గ్రామంలోని రామాలయాన్ని అన్ని హంగులతో ఆధునీకరించామని తెలిపారు. అదే విధంగా చిత్తారమ్మ దేవాలయంలో అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు.

– అదే విధంగా కూకట్‌పల్లి నియోజకవర్గంలోని దేవాలయాల్లో దీపదూప నైవేద్యాలకు ఎటువంటి లోటు రాకుండా చూసుకుంటున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కాండూరి నరేంద్రాచార్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం బ్రాహ్మణులు మాధవరం కృష్ణారావును సన్మానించి తమ మద్దతు కృష్ణారావు ఉంటుందని ఏకగ్రీవ తీర్మానం చేశారు.

పార్టీ అభ్యర్థులతో ఎన్నికల అధికారుల సమావేశం



ఎన్నికలపై పార్టీల అభ్యర్థులతో సమావేశమైన ఎన్నికల అధికారులు

కూకట్‌పల్లి: రానున్న ఎన్నికలకు సంబంధించి కూకట్‌పల్లి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి పోటీలో ఉన్న అభ్యర్థులతో జనరల్ అబ్జర్వర్ శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు పార్టీల అభ్యర్థులతో సమావేశం నిర్వహించి ఈవీఎంల ర్యాండమైజేషన్‌కు సంబంధించి వివరించారు. ఈ సందర్భంగా పార్టీల నాయకులకు పలు సలహాలు, సూచనలు అందజేశారు.

తెలంగాణ అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

కూకట్‌పల్లి అభ్యర్థి బండి రమేష్



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బండి రమేష్, సత్యం శ్రీరంగం, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు



కూకట్‌పల్లి: ఫతేనగర్, అల్లాపూర్ డివిజన్లలో శనివారం కూకట్‌పల్లి కాంగ్రెస్ అభ్యర్థి బండి రమేష్ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భరత్‌నగర్, ఫతేనగర్‌లలో చాలా సమస్యలు ఉన్నాయని తెలిపారు. వితంతువులు, వృద్ధులకు పెన్షన్‌లు రావటం లేదన్నారు. విద్యార్థులు ఉన్నత చదువుల కోసం డబ్బులు లేక కూలిపనికి, కంపెనీల్లో పనులకు వెళుతున్నారన్నారు. ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ చలాన్‌ను కట్టలేక ఆటోలు అమ్ముకుంటున్నారని అన్నారు. తెలంగాణలో మీ కష్టాలను తీర్చడానికి కాంగ్రెస్ ఒక దిక్సూచిలాగా మీకు అండగా ఉంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆడపిల్ల పెళ్లికి లక్ష రూపాయలతో తులం బంగారం పెళ్లి పందిట్లోనే ఇస్తుందన్నారు. విద్యార్థులకు 15శాతం బడ్జెట్‌లో కేటాయిస్తుందన్నారు. తప్పకుండా కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని కోరారు.

◆ ఈ సందర్భంగా బ్లాక్ ప్రెసిడెంట్ నాగిరెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నుంచి అబ్దుల్ తన మిత్రులతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యువ వికాస్ పథకానికి ఆకర్షితులమై స్వచ్ఛందంగా కాంగ్రెస్‌లో చేరామని తెలిపారు. అనంతరం బండి రమేష్ వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా తెలంగాణ అభివృద్ధి చెందాలంటే ఒక్క కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి సత్యం శ్రీరంగం, సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, సీపీఐ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెంకట్‌రెడ్డి, డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సింహయాదవ్, రమేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జంగ్ 2023 తెలంగాణ



గాయత్రినగర్, బోరబండలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న బండి రమేష్, సత్యం శ్రీరంగం, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు

నిస్వార్థంగా పనిచేసే వారినే పార్టీ గుర్తిస్తుంది

మధ్యప్రదేశ్ బీజేపీ ఇన్‌చార్జ్ మురళీధర్‌రావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మురళీధర్‌రావు, పాల్గొన్న వడ్డేపల్లి రాజేశ్వరరావు, మాధవరం కాంతారావు తదితరులు

ఆల్విన్‌కాలనీ: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మధ్యప్రదేశ్ ఇన్‌చార్జ్ మురళీధర్‌రావు శనివారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు నివాసంలో ఏర్పాటు చేసిన అల్పాహార విందుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా అక్కడ పాల్గొన్న కార్యకర్తలు అందరితో ఆత్మీయంగా మాట్లాడారు. అనంతరం వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ... ఎన్నికల్లో పార్టీ కార్యకర్తలు అందరూ సమష్టిగా పనిచేసి ఉమ్మడి అభ్యర్థి ముమ్మారెడ్డి ప్రేమకుమార్‌ను గెలిపించుకోవాలన్నారు.

◆ అనంతరం మురళీధర్‌రావు మాట్లాడుతూ... జాతీయ నాయకత్వం ఇచ్చిన ఆదేశం మేరకు అందరం సమష్టిగా పనిచేసి నరేంద్ర మోదీ నాయకత్వాన్ని కేంద్రంలో బలపర్చాలన్నారు. పార్టీ అభ్యున్నతికి నిస్వార్థంగా పనిచేస్తున్న కార్యకర్తలకు ఖచ్చితంగా పార్టీ గుర్తిస్తుందని తెలిపారు. ఎవరూ తొందరపడి ఎలాంటి నిర్ణయాలు తీసుకోకుండా పార్టీని వదలకుండా ప్రతిష్ఠ పరచుకోవాలన్నారు.

◆ కూకట్‌పల్లిలో బీజేపీ, జనసేన పార్టీలు బలపర్చిన ఉమ్మడి అభ్యర్థి ముమ్మారెడ్డి ప్రేమకుమార్‌ని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సురేందర్ రెడ్డి, జిల్లా నాయకులు శంకర్‌రెడ్డి, డకయ్య, శ్రీనివాస్‌గౌడ్, డివిజన్ అధ్యక్షుడు అనంత నాగరాజు, రమేష్, మనోహర్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

20 నుంచి మహిళలకు ఉచిత శిక్షణ

మూసాపేట: కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్, సోని కాంపెక్స్‌లోని ఎస్.సంజీవరెడ్డి ఫౌండేషన్‌లో మహిళలకు ఉచిత శిక్షణ అందించనున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. మహి ళలకు టైలరింగ్, బ్యూటీషియన్, మగ్గం వర్కు, కొబ్బరి పీచు వస్తువుల తయారీలో ఉచితంగా శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. మగ్గం, పీచు వర్కు నేర్చుకునే వారికి ఉచితంగా మెటీరియల్ అందజేస్తారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. కోర్సు అనంతరం సర్టిఫికెట్‌తో పాటు స్వయం ఉపాది పొందవచ్చని తెలిపారు. ఈనెల 20 నుంచి తరగతులు ఉంటాయన్నారు. ఆసక్తి కలిగిన మహిళలు ఆధార్, పాస్ పోర్టు ఫొటోతో సంప్రదించవచ్చన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నం.93961 61936లో సంప్రదించాలన్నారు.

జపాన్‌లో ఉన్నత విద్యావకాశాలు

గచ్చిబౌలి: జపాన్‌లోనూ విద్యావకాశాలు పుష్కలంగా ఉన్నాయని కాన్సుల్ జనరల్ ఆఫ్ జపాన్(చెన్నై) హెటాగా మసయూకీ పేర్కొన్నారు. శనివారం కొండాపూర్‌లోని ఏషియన్ సన్‌సిటీలో నాగ రామ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జపనీస్ ఫెస్టివల్‌లో నా.రా జపాన్ హబ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జపాన్ హబ్‌తో భారత్, జపాన్ మధ్య మైత్రి బలోపేతమవుతుందన్నారు. జపాన్ కల్చర్, ఎడ్యుకేషన్, టూరిజం తదితర అవకాశాలను తెలుసుకునేందుకు వీలుంటుందన్నారు. నాగ రామ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు నాగనాథ్ మాట్లాడుతూ 20 ఏళ్ల పాటు జపాన్‌లో ఉన్న అనుభవంతో నా.రా జపాన్ హబ్‌ను ఏర్పాటు చేశామన్నారు. కల్చర్ ఎక్స్ఛేంజ్‌తో పాటు జపనీస్ భాష నేర్పుతామని తెలిపారు. జపాన్‌కు వెళ్లాలనుకునే విద్యార్థులకు కౌన్సిలింగ్ ఇవ్వడం, విద్యావకాశాల గురించి తెలియజేస్తామన్నారు. జపనీస్ ఫెస్టివల్‌లో మూడు రోజుల పాటు జపనీస్ డాల్స్, బొన్సాయ్ మొక్కల ప్రదర్శన ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జపాన్ ఫౌండేషన్ (న్యూఢిల్లీ) డైరెక్టర్ జనరల్ సటు కోజీ, నాగ రామ ట్రస్ట్ ప్రెసిడెంట్ రామభద్ర తదితరులు పాల్గొన్నారు.

మార్వాడీల సమస్యలను తీరుస్తా

శేరిలింగంపల్లి బీజేపీ అభ్యర్థి రవికుమార్ యాదవ్





ఆల్విన్‌కాలనీ డివిజన్‌కు చెందిన మార్వాడీలతో సమావేశమైన రవికుమార్‌యాదవ్ తదితరులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి హౌసింగ్‌బోర్డులోని పద్మరాగ బ్యాంకిట్‌హాలులో ఆల్విన్‌కాలనీ డివిజన్‌కు చెందిన మార్వాడీ సమాజం వారితో శేరిలింగంపల్లి బీజేపీ అభ్యర్థి రవికుమార్ యాదవ్‌సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రానున్న ఎన్నికల్లో మీ పూర్తి మద్దతు బీజేపీకి ఉండాలన్నారు. బీజేపీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలని సూచించారు. తాను గెలిచిన అనంతరం సమస్యలను తీరుస్తానని హామీ ఇచ్చారు. మార్వాడీ సమాజానికి కావాల్సిన మౌలిక సదుపాయాలను కల్పిస్తామన్నారు. నియోజకవర్గంలో ఉన్న మార్వాడీలు తనకు మద్దతు ఇస్తున్నట్లు నిర్ణయించుకున్నారని తెలిపారు.



కాపుల ఆత్మీయ సమ్మేళనం



కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ కాలనీ ఫంక్షన్ హాల్‌లో కాపులు ఆత్మీయ సమ్మేళనంలో బీజేపీ బలపర్చిన జనసేన అభ్యర్థి ముమ్మారెడ్డి ప్రేమకుమార్ శనివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో బీజేపీ, జనసేన పార్టీ ఉమ్మడి అభ్యర్థిగా మీ ముందుకు వస్తున్నానని అన్నారు. సీటు తీసుకురావడమే తన వంతని, గెలిపించుకోవటం మీ వంతని అన్నారు. తాను గెలిస్తే మీరందరూ గెలిచినట్లే అన్నారు. కాపులు ఐక్యంగా ఉండి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పరసా పరమేశ్వరరావు, ఉమా మహేశ్వర్‌రావు, యాళ్ల వరప్రసాద్, కూకట్‌పల్లి కాపు సంఘం అధ్యక్షుడు భరత్‌కుమార్, వై.ఆనంద్‌రావు, కాపు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప పడిపూజ



కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని శ్రీఅయ్యప్ప స్వామి దేవాలయంలో 18 కలశముల అష్టాదశ పడిపూజ శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ పడిపూజ కార్యక్రమాన్ని మాన్యశ్రీ అరుణ్ గురుస్వామి నిర్వహించారు. వందలాది మంది అయ్యప్ప స్వాములు, భక్తులు పాల్గొన్నారు. అనంతరం తీర్థ ప్రసాదములు అందజేశారు.

తెలంగాణ అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉంది

మాధవరం కాంతారావు



ప్రభాకర్‌రెడ్డినగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న మాధవరం కాంతారావు, నాయకులు

కూకట్‌పల్లి: రాష్ట్ర అభివృద్ధికి నిధులు కేటాయిస్తూ తెలంగాణ అభివృద్ధికి నరేంద్ర మోదీ ప్రభుత్వం కట్టుబడి ఉందని బీజేపీ కూకట్‌పల్లి అసెంబ్లీ ఇన్‌చార్జ్ మాధవరం కాంతరావు అన్నారు. శనివారం బీజేపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి ముమ్మారెడ్డి ప్రేమకుమార్‌కు మద్దతుగా ఫతేనగర్ డివిజన్ పరిధిలోని ప్రభాకర్‌రెడ్డినగర్‌లో ప్రచారం నిర్వహించారు. కేసీఆర్ పాలనా వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ గాజు గ్లాసు గుర్తుపై ఓటు వేసి ప్రేమకుమార్‌ను గెలిపించాలని కోరారు.

◆ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రధాని మోదీ పాలనలో భారతదేశ ఖ్యాతి అంతర్జాతీయంగా పెరిగిందన్నారు. తొమ్మిదేళ్ల పాలనలో ఎక్కడ అవినీతి ఆరోపణ లేదన్నారు. ప్రతి ఇంటికి మోదీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానని.. ఇంటికో ఉద్యోగమని దొంగ హామీలతో తెలంగాణ ప్రజలను రెచ్చగొట్టి అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలను విస్మరించారన్నారు.

◆ ప్రశ్నించే ప్రతిపక్ష పార్టీలపై దాడులు, అక్రమ కేసులు పెట్టి ఓ నయా నిజాంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండకుండా కేవలం కబ్జాలకే ప్రాధాన్యత ఇచ్చే కూకట్‌పల్లి శాసనసభ్యుడు ఏ మొహం పెట్టుకొని ఓట్లు అడుగుతున్నారని ప్రశ్నించారు. విద్యావంతుడు, మంచి మనిషి, సేవా రంగంలో తనదైన ముద్ర వేసుకున్న బీజేపీ బలపర్చిన కూకట్‌పల్లి అసెంబ్లీ జనసేన అభ్యర్థి ముమ్మారెడ్డి ప్రేమకుమార్‌కు ఓటు వేసి గెలిపించాలన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పడాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాంమోహన్, కృష్ణగౌడ్, సతీష్, ఉదయ్, రమేష్, వీర మహిళలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అమోర్ ఆస్పత్రిలో వైద్యులకు వర్క్‌షాప్

వందమంది దక్షిణాది రాష్ట్రాల వైద్యులకు శిక్షణ



అమోర్ ఆస్పత్రిలో నిర్వహించిన వర్క్‌షాపును ప్రారంభించిన డాక్టర్ ఆర్. గోపీనాథ్, అమోర్ ఆస్పత్రి సీఎండి, ప్రముఖ ఆర్థో అంకాలజీ నిపుణులు డాక్టర్ కిశోర్ బి. రెడ్డి, తదితరులు

కూకట్‌పల్లి: నగరంలోని ప్రధాన ఆస్పత్రులలో ఒకటైన కూకట్‌పల్లిలోని అమోర్ ఆస్పత్రిలో దక్షిణాది రాష్ట్రాల వైద్యుల కోసం ఒక రోజు రీససిటేషన్ వర్క్‌షాపును శనివారం నిర్వహించారు. ఇండియన్ సొసైటీ ఆఫ్ క్రిటికల్ కేర్ మెడిసిన్ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో దక్షిణాది రాష్ట్రాల నుంచి వంద మందికి పైగా క్రిటికల్ కేర్ వైద్య నిపుణులు పాల్గొన్నారు.

◆ నగరంలోని ఈఎస్ఐ ఆస్పత్రి ఎనస్థీషియాలజీ, క్రిటికల్ కేర్ విభాగం అధిపతి డాక్టర్ ఆర్. గోపీనాథ్ వర్క్‌షాపును ప్రారంభించారు. ఇందులో ప్రధానంగా తీవ్రమైన ప్రమాదాలకు గురై వచ్చినప్పుడు తీవ్ర అనారోగ్యంతో రోగులు వచ్చినప్పుడు వారికి ఉన్న సమస్యలను సూక్ష్మస్థాయిలో గుర్తించడం, అందుకు తగినట్లు సరైన చికిత్స అందించడంపై ప్రధానంగా దృష్టి సారించారు. మొత్తం పది లెక్చర్ల సెషన్లు, ఆరు ట్రైనింగ్ సెషన్లతో ఈ కార్యక్రమం జరిగింది.

◆ ఈ సందర్భంగా ఫ్యాకల్టీగా వ్యవహరించిన అమోర్ ఆస్పత్రి సీఎండీ, ప్రముఖ ఆర్థో అంకాలజీ నిపుణులు డాక్టర్ కిశోర్ బి.రెడ్డి మాట్లాడుతూ.. ఎవరైనా ప్రమాదాల్లో గాయపడినప్పుడు సాధారణంగా మనం ఎముకలకు ఏమైందనే చూస్తుంటామన్నారు. కానీ వాటి చుట్టుపక్కల ఉండే రక్తనాళాలు, కండరాలు చాలా ముఖ్యమని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తాను నయం చేసిన కొన్ని తరహా కేసులకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ప్రదర్శించి వైద్యులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కోర్స్ డైరెక్టర్, అమోర్ ఆస్పత్రి క్రిటికల్ కేర్ విభాగాధిపతి డాక్టర్ జక్కి నబోయిన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాక్సింగ్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



బాక్సింగ్ పోటీల ఎంపిక కార్యక్రమంలో పాల్గొన్న క్రీడాకారులు

బాలానగర్: జేఎన్‌టీయూ పరిధిలోని పలు ఇంజినీరింగ్ కళాశాలల్లోని క్రీడాకారుల ఎంపిక శనివారం యూనివర్సిటీలో జరిగింది. మహిళల, పురుషుల ఆల్ ఇండియా ఇంటర్నల్ బాక్సింగ్ పోటీలకు క్రీడాకారులను ఎన్నుకున్నారు. ఈ ఎంపికలో 35 మందికి పైగా పాల్గొన్నట్లు సెలక్షన్ కమిటీలో స్పోర్ట్స్ సెక్రటరీ డా. ఎస్ఎస్ దిలీప్, జేఎన్‌యూటీ స్పోర్ట్స్ డైరెక్టర్ డా. నల్లగొండ అశోక్ తెలిపారు.



పాఠశాలలో గ్రామోత్సవం

గ్రామీణ ప్రజల జీవన విధానంపై విద్యార్థులకు అవగాహన



అక్షర ఇంటర్నేషనల్ స్కూలులో నిర్వహించిన అక్షర గ్రామోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు



కూకట్‌పల్లి: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల జీవన విధానం, వారి నేపథ్యం, నేటి తరానికి అర్థమయ్యేలా చెప్పడం కోసం కూకట్‌పల్లిలోని అక్షర ఇంటర్నేషనల్ స్కూల్ బ్రాంచ్‌లో శనివారం అక్షర గ్రామోత్సవ్ పేరుతో కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా పాఠశాల విద్యార్థులు గ్రామీణ ప్రాంతాల్లో నివసించే వేషధారణలో అలరించారు. అదే విధంగా గ్రామీణ ప్రాంత కుల వృత్తులు, వారి రోజువారి కార్యక్రమాలను తలపించేలా విద్యార్థులు చేసిన కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు గ్రామీణ నేపథ్యాన్ని ప్రదర్శిస్తూ చేసిన కళాకండాలు, నృత్యాలు, వారి నివాసగృహాలు, అలనాటి చరిత్రను తలపించేలా చేసి తల్లిదండ్రులను మైమరిపించారు.

◆ ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ హైమావతి మాట్లాడుతూ.. నేటి తరం విద్యార్థులకు గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల జీవన విధానం, వారి నేపథ్యం మీద అవగాహన ఉండాల్సిన అవసరం ఉందన్నారు. మారుతున్న ప్రజల జీవన విధానం మూలంగా నాటి గ్రామీణ చరిత్రను నేటి తరం తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ జగన్‌మోహన్‌రావు, వైస్ ప్రిన్సిపాల్, పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి కోసం కారు గుర్తుకు ఓటేయండి



ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి బీఆర్‌యస్ పార్టీ అభ్యర్థి అరెకపూడి గాంధీ శనివారం కూకట్‌పల్లి డివిజన్‌లోని పాపిరెడ్డినగర్, ఆస్‌బెస్టాస్ కాలనీలో స్థానిక కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణతో కలిసి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ పార్టీ విజయమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నామన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలే బీఆర్‌యస్‌కు శ్రీరామరక్ష అన్నారు. భవిష్యత్తులో మరింత అభివృద్ధి కావాలంటే కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

గాంధీ కుటుంబ సభ్యుల ప్రచారం

గాంధీ సతీమణి శ్యామలాదేవి, కుమారుడు పృధ్వీ, కుమార్తె ప్రణతి, కోడలు భార్గవితో కలిసి శనివారం ఇంద్రాహిల్స్, ఆదిత్యనగర్, సాయి చరణ్ కాలనీ, ఇంద్రానగర్, శంషీగూడలో ప్రచారం చేశారు.